హామీలు అమలు చేయాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లి కమాన్: చాడ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 15: ఎన్నికల సమయంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి సీపీఐ పార్టీ తరుపున సహకారం అందించాలని కోరుతూ చాడ వెంకట్‌రెడ్డికి సమగ్రశిక్షా ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ తాండ్ర సదానందం, ఎస్ వెంకటేశ్వర్లు, ఎం తిరుపతి, సత్యనారాయణ, రవికుమార్, కుంబాల సుధాకర్, పుల్లూరి సంధ్యారాణి, రాజ్ కుమార్, మల్లన్న, శ్రీనివాసరావు ఉన్నారు.

వేడుకలు జయప్రదం చేయాలి

కోల్‌సిటీ, డిసెంబర్ 15: సీపీఐ పార్టీ ఈ నెల 26తో వంద సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గ్రామగ్రామాన, వాడవాడనా ఘనంగా వేడుకలు నిర్వహించాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు స్థానిక భాస్కరరావు భవన్‌లో నగర కార్యదర్శి కే కనకరాజ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

బీజేపీతో రాజ్యాంగానికి ప్రమాదం

బీజేపీ ప్రభుత్వంతో భారత రాజ్యాంగానికి ప్రమాదం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి పేర్కొన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో పూలే అంబేద్కర్ జ్ఞానమాల నిర్వహించారు. ఈ సందర్భంగా పూలె, అంబేద్కర్ విగ్రహాలకు చాడ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, ఆలయ ఫౌండేన్ డిప్యూటీ సీఈవో రాజేంద్ర కుమార్ పర్యవేక్షణలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కాలువను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్15: కాల్వశ్రీరాంపూర్ మండలం ఇదూల్లపూర్ గ్రామ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే ప్రథమ కర్తవ్యంగా పని చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. ఆదివారం పెద్దపల్లి బండారికుంట నుంచి ఇదులాపూర్ వరకు శ్రీరాంసాగర్ డీ-83 కూడి కాలువ 22ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇదుల్లపూర్, జాఫార్‌ఖాన్ పూట చివరికి భూములకు సాగునీరు అందించేందుకు గానూ కాలువ మరమ్మతులు, పూడికతీత, చెట్లు తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. సాగునీటికి రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఇక్కడ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, తూముల సుభాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్లు మాదిరెడ్డి నర్సింహారెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి, నాయకులు కలవేణ మహేందర్, ఉప్పు రాజు, ఎనగందుల ప్రదీప్, ఆరె సంతోష్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీటీసీలో భద్రతా పక్షోత్సవాలు

రామగిరి, డిసెంబర్ 15: సింగరేణి ఏపీఏ ఏరియాలోని వీటీసీలో భద్రతా తనిఖీ బృందం కన్వీనర్ కోటిరెడ్డి, సభ్యులు ఆదివారం పర్యటించారు. ముందుగా వీటీసీ అధికారులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో తనిఖీ బృందం కన్వీనర్ మాట్లాడుతూ, సింగరేణిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ముందుగా వీటీసీ శిక్షణ నుంచే భద్రత, క్రమశిక్షణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనుక్షణం భద్రతతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, మేనేజర్ సుర్జిత్, ఎస్ఈ శ్రీనివాస్, తనిఖీ బృందం సభ్యులు జ్ఞాన సంబంధన్ ఉన్నారు.

అనాథ పిల్లలు.. ఆటల్లో ఆణిముత్యాలు

మెడల్స్ సాధించిన చిన్నారులతో ఆశ్రమ నిర్వాహకుడు రాజయ్య

కోల్‌సిటీ, డిసెంబర్ 15: ఈ అనాథ పిల్లలు.. ఆటల్లో ఆణిముత్యాలుగా వెలుగుతున్నారు. గోదావరిఖని గాంధీనగర్‌లో గల ఎండీహెచ్ డబ్ల్యూఎస్ బాలల సంరక్షణ కేంద్రానికి చెందిన జీ రామ్, జీ లక్ష్మణ్ కవలలతోపాటు మరో విద్యార్థి ఎం శ్యాంప్రసాద్ ఇటీవల జరిగిన సీఎం కప్ క్రీడా పోటీలలో ఖోఖో విభాగంలో రామగుండం మండలంలో మొదటి స్థానంలో నిలిచారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7, 8వ తరగతి చదువుతున్న వీరికి పీడీ ఎం రమాదేవి వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తూ ప్రావీణ్యులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కూడా ఈ చిన్నారులు ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. రెండు రోజుల క్రితం రామగుండం ఎన్టీపీసీలో జరిగిన మండల స్థాయి పోటీల్లో గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరపున పాల్గొని వివిధ పోటీల్లో మెడల్స్ సాధించడం గర్వంగా ఉందని పీడీ రమాదేవి తెలిపారు. చిన్నప్పుడే అమ్మ నాన్నలను కోల్పోయిన చిన్నారులను ఆశ్రమ నిర్వాహకుడు పోచంపల్లి రాజయ్య చేరదీసి పెంచి పెద్ద చేస్తున్నారు. వారికి విద్యా బుద్ధులు చెప్పించడమే కాకుండా కరాటే, ఖోఖో, కబడ్డీలో శిక్షణ ఇప్పిస్తున్నారు. మండల స్థాయి పోటీలలో మెడల్స్ సాధించి తమ ఆశ్రమానికి పేరు తీసుకవచ్చారని నిర్వాహకుడు రాజయ్య మెచ్చుకున్నారు.

దొంగలు దొరికేదెప్పుడో!

- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస చోరీలు
- దేవాలయాలు, తాళం వేసిన ఇండ్లే టార్గెట్
- ఆందోళనలో ప్రజలు.. అన్వేషణలో పోలీసులు

కమాన్‌పూర్, డిసెంబర్15: మండలంలో తాళం వేసిన ఇండ్లు, దేవాలయాల్లో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దొంగతనాలను ఛేదించడం, దొంగల ఆచూకీ కోసం పోలీసులు తమదైన శైలిలో విచారణ కొనసాగిస్తున్నారు. దొంగలు దొరికేదెప్పుడు.. దొంగతనాల గుట్టు వీడెదెప్పుడు అనేది మాత్రం వేచి చూడాల్సిందే. ఇక వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పలు గ్రామాల్లో గల దేవాలయాల్లో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. జూలపల్లిలోని పెద్దమ్మతల్లి ఆలయం, పెంచికల్ పేటలోని ఆలయం, మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీలు చోటుచేసుకున్నాయి. వరుసగా దేవాలయాల్లో చోరీలు, ఆ తదుపరి ఇండ్లలో సైతం జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వీధిలో గల సాగి అంజలి రత్నాకర్‌రావు ఇంట్లో 10 తులాల బంగారం, ₹1.50లక్షల నగదు, బిల్ల రాజయ్య ఇంట్లో 11తులాల బంగారం, 80తులాల వెండి, ₹28వేలు దొంగిలించారు. ఈ రెండు ఇండ్లలోని వారు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా చోటుచేసుకున్నాయి. కేవలం పక్షం రోజుల వ్యవధిలోనే పోస్టాఫీస్ వీధిలో గల రెండు ఇండ్లలో దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను మరింతగా పెంచి దొంగతనాలు జరగకుండా పోలీసులు చూడాలని కోరుతున్నారు.

కార్మికులకే లేబర్ కార్డు

రామగిరి, డిసెంబర్ 15: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు మాత్రమే లేబర్ కార్డు వర్తిస్తుందని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి పేర్కొన్నారు. స్థానిక భవన నిర్మాణ కార్యాలయంలో ఆదివారం సమావేశంలో మాట్లాడారు. లేబర్ కార్డు ఉన్న కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాల పెళ్లి కానుక ₹30వేలు, మెటర్నటీ ₹30వేలు, ప్రమాద బీమా ₹6 లక్షలు, శాశ్వత అంగవైకల్యం ₹4లక్షలు వస్తాయన్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు బ్రోకర్లు లేబర్ ఆఫీసర్లతో కుమ్మకై ఇంటింటికెళ్లి డబ్బులు ఇస్తే లేబర్ కార్డు ఇస్తామని మోసం చేస్తున్నారన్నారు. ఇక్కడ షరీఫ్, సురేశ్, రాములు, శంకర్, మల్లయ్య, విష్ణువర్ధన్, సమ్మయ్య, సారయ్య, సంతోష్, రమేశ్ ఉన్నారు.

పని వేళల్లో మార్పు చేయాలి

పెద్దపల్లి టౌన్, డిసెంబర్15: పెద్దపల్లి మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల పని వేళల్లో మార్పు చేసి.. రెండూ షిఫ్టులు చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావుకు ఐఎన్టీయూసీ పట్టణాధ్యక్షుడు మల్లారపు కొమురయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు కొమురయ్య తెలిపారు.

స్టడీ సెంటర్ పరిశీలన

వేములవాడ రూరల్, డిసెంబర్ 15 : మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను రాష్ట్ర కోఆర్డినేటర్ విజయకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పదో తరగతి ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు సలహాలు అందించారు. విద్యార్థులు ఓపెన్ స్కూల్‌కు హాజరుకావాలన్నారు.

ఇందిరమ్మ మోడల్ కాలనీకి మోక్షం లభించేనా?

- ధర్మారంలో 15 ఏండ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు

జక్కన్నపల్లి వద్ద ఇందిరమ్మ మోడల్ కాలనీకి కేటాయించిన స్థలం

ధర్మారం, డిసెంబర్ 15: ధర్మారం మండల కేంద్రంలోని జక్కన్నపల్లిలో ఇందిరమ్మ మోడల్ కాలనీ నిర్మాణం కలగానే మిగిలిపోయింది. పేదల ఇంటి నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 38 మందికి పట్టాలు ఇచ్చి, ఇండ్లు మంజూరు చేసి ఆ తర్వాత ముగ్గు పోసి చేతులు దులుపుకున్నది. హౌసింగ్ బిల్లులు ఇవ్వకుండా చేతులెత్తేయడం, ఎలాంటి మౌళిక వసతులు కల్పించకపోడంతో ఇండ్ల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి రాష్ట్రంలో ధర్మారం మండల కేంద్రం అనుబంధ గ్రామం జక్కన్నపల్లిలో గూడు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించాలని అప్పటి కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. ఇందిరమ్మ పథకం కింద ఇండ్ల నిర్మాణానికి 375 సర్వే నంబర్‌లో ఒక్కొక్కరికి ఒక గుంట చొప్పున స్థలాన్ని కేటాయించింది. 2009 ఫిబ్రవరిలో అప్పటి పెద్దపల్లి ఎంపీ వెంకటస్వామి, అప్పటి జడ్పీ చైర్మన్, ప్రస్తుత ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ లబ్ధిదారులకు నివేశన స్థలాల పట్టాలు అందజేశారు. కానీ ఆ కాలనీలో నీటి సౌకర్యం, రోడ్లు, తదితర మౌలిక వసతులు కల్పించకపోవడం లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకోలేకపోయారు. మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇంటి నిర్మాణం పూర్తి చేస్తేనే బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ అధికారులు తేల్చిచెప్పడం, మరోవైపు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎవరూ ముందుకు వెళ్లలేకపోయారు. 38 మందిలో కేవలం ఇద్దరు మాత్రమే అతికష్టం మీద ఇండ్లు నిర్మించుకోగా, కొందరు పునాదులు తీసి బేస్‌మెంట్ కట్టుకున్నారు. మరికొందరు స్లాబ్ వరకు నిర్మించుకొని మధ్యలోనే వదిలేశారు. మౌలిక వసతులు కల్పిస్తే ఇండ్లు కట్టుకుంటామని లబ్ధిదారులు ఏండ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు సొంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ పథకం కింద పేదలు ఇంటిని నిర్మించుకునేందుకు ₹5లక్షలు ఇవ్వబోతుండగా, ఇదివరకే పట్టాలు ఉన్నందున తమకు అవకాశం కల్పించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అద్దె చెల్లించే స్థోమత లేదు..

నేను నిరుపేదను. ఎలాంటి ఆస్తి ఆస్తులు లేవు. నా ఇద్దరు బిడ్డలకు గతంలోనే వివాహాలు జరిపించా. నా భర్త రెండేండ్ల క్రితం మరణించాడు. నాకు గతంలోనే ఇందిరమ్మ కాలనీలో జాగ ఇచ్చారు. ఇల్లు కూడా మంజూరు చేశారు. కట్టుకుంటే బిల్లులు మంజూరు చేస్తమని అన్నరు. కానీ అక్కడ ఎలాంటి వసతుల లేక పోవడంతో కట్టుకోలేకపోయా. కొన్నాళ్లు కిరాయికి ఉన్న. ఇప్పుడు అద్దె చెల్లించే స్థోమత లేక పాత పోలీసు క్వార్టర్‌లో నివాసం ఉంటున్న. ప్రస్తుతం ఇందిరమ్మ పథకంలో నాకు మోడల్ కాలనీలో ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న.

– తిరునగరి వనజ, ఇందిరమ్మ మోడల్ కాలనీలబ్ధిదారు, ధర్మారం

సమస్యల సాధన కోసం బస్సు జాత

బస్సు జాత వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న మహిళా నేతలు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్15: ఆశ కార్యకర్తల సమస్యల సాధన కోసం చేపట్టిన బస్సు ఈ నెల 17న పెద్దపల్లికి చేరుకుంటుందని సీఐటీయూ గౌరవాధ్యక్షురాలు గడ్డం జ్యోతి తెలిపారు. ఆదివారం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన ఆవరణలో రాష్ట్ర బస్సు జాత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనం అందిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా... ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదన్నారు. ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని, ఈఎస్ఐ, పెండింగ్‌లో ఉన్న సర్వే డబ్బులు, తదితర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బస్సు జాతకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ నాయకులు వెంకటేశ్వరి, అరుణ, పద్మ, ప్రమీల ఉన్నారు.

బిజినెస్

యూపీఐపై క్రెడిట్ లైన్

ఎలా వాడుకోవాలో తెలుసా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్లైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పే లోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడి వైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

గుర్తుంచుకోండి..

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకు నుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీ రేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.

పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎలా?

చిన్నచిన్నగా పొదుపు పాఠాలు నేర్పండిలా..

ఈ రోజుల్లో పిల్లలు చాలా చాలా చురుగ్గా ఉంటున్నారు.

హింటిస్తే చాలు అల్లుకుపోతున్నారు. ప్రతీ విషయంలో తెలివిగా ఆలోచించి నేర్చుకుంటున్నారు.

తల్లిదండ్రులు కాస్త ఓపిగ్గా చెబితే ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. మరి పసితనంలోనే పొదుపు పాఠాలు నేర్పుతారా! నిపుణుల సలహాలేమిటి?

ప్రతీ మనిషి తన జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. అది చిన్నతనం నుంచే అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు. నిజానికి ఇది ఒకప్పటితో పోల్చితే ఇప్పటి తరాలకు నేర్పడం సులభమనే చెప్పవచ్చు. టెక్నాలజీపరంగా కూడా నేటి పిల్లలు ఎంతో ముందుంటున్నారు. వారికి నచ్చినవిధంగా మనం చెప్పగలిగితే వారి నుంచి అద్భుతాలనే ఆశించవచ్చంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలు.. ఆటలు, చదువు, ఇతరత్రా రంగాల్లోనే రాటుదేలాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే శిక్షణను కూడా ఇప్పిస్తున్నారు. అయితే ఇవన్నీ అవసరమైనవే అయినా.. మనీ మేనేజ్‌మెంట్ కూడా చాలాచాలా ముఖ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. వివేకవంతమైన నిర్ణయాల్లో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేస్తున్నారు. అందుకే ఈ విధంగా ముందుకెళ్లాలంటూ సూచిస్తున్నారు.

పొదుపు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు విలువను తెలియజేస్తూ పెంచాలి. అప్పుడే బాధ్యతలనేవి తెలిసొస్తాయి. ప్రతి నెలా పిల్లలకు రూ.10 లేదా రూ.20 ఇస్తూ వెళ్లండి. ఇచ్చేటప్పుడే ఆ డబ్బును దాచుకుంటే రేపు వాళ్ల అవసరాలను దానితో ఎలా తీర్చుకోవచ్చో వివరించండి. ఒకవేళ మీకు అవసరమైతే ఆ నగదును అడిగి తీసుకుని, మళ్లీ తిరిగిచ్చేటప్పుడు అదనంగా ఇంకాస్త ఇవ్వండి. దీంతో సంపాదన అంటే ఏంటో కూడా తెలుస్తుంది. ఇలా ఒక ఏడాదిపాటు ఆ పైసలను ఖర్చు చేయకుండా దాచుకోవాలని చెప్పి, అందుకు మద్దతుగా నిలవండి. అప్పుడు ఒక్కసారిగా పోగయ్యే ఆ సొమ్ముతో వారికి అవసరమైనవి కొనివ్వండి. ఇలా మీరే కాదు.. ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరిచ్చినా అలాగే దాచుకునేలా అలవాటు చేస్తే మంచి ఫలితాల్నే చూడవచ్చు.

ఖర్చులు

ఆర్థిక క్రమశిక్షణలో పొదుపు ఎలాంటి పాత్ర పోషిస్తుందో.. ఖర్చులూ అలాంటి భూమికనే వహిస్తాయి. అందుకే అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియజెప్పాలి. వినకపోతే నచ్చజెప్పాలేగానీ.. తిట్టి, కొట్టి వారిని దారికి తెచ్చుకోవాలనుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుందన్నది మరువద్దు. ఎందుకంటే ఇలాచేస్తే పిల్లలు మొండిగా తయారవుతారు. ఆహారం, పుస్తకాలు అవసరమైనవని.. బొమ్మలు, చిరుతిళ్లు అనవసరమైనవని చెప్పాలి. ఉదాహరణకు ఒక వెయ్యి రూపాయలతో ఓ గేమ్‌ను లేదా స్కూల్ షూస్ కొనవచ్చని చెప్పి, దేనికెంత ప్రాధాన్యమో తెలియపర్చండి. అనవసరంగా, వృథాగా ఖర్చుచేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజేయండి. చెబితే విన్న దాని కంటే చూస్తే నేర్చుకునేదే ఎక్కువ మరి. కనుక ఇంటి ఆర్థిక విషయాల్లో వీలున్నంత మేరకు మీ పిల్లలని భాగస్వాములని చేయండి.

లక్ష్యాలు

ఆర్థిక లక్ష్యాలు అనేవి చాలా కీలకం. పిల్లలు కోరిన ఓ బొమ్మ కోసమో లేదా మరే ఇతర వస్తువుకైనాసరే దానికయ్యే నగదును ఎలా దాచుకోవాలి, సంపాదించాలన్నదాని కోసం ఓ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఈ లక్ష్య సాధనకు వారి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించాలి. ఉదాహరణకు వారికి రూ.1,500 కావాలంటే నెలకు రూ.150 చొప్పున సేవ్ చేసుకునేలా ముందుకు తీసుకెళ్లండి. 10 నెలల్లో రూ.1,500 అందేలా చేస్తే ఆ డబ్బు విలువ, కష్టం, సమయం విలువ కూడా తెలుస్తుంది. పిల్లలో సహనం, ఓపిక పెంపొందించడానికీ ఇది దోహదం చేస్తుంది.

పెట్టుబడి

పిల్లలకు చిన్నప్పట్నుంచే పెట్టుబడి ప్రాధాన్యతను, దానికున్న అవకాశాలనూ తెలియపర్చాలి. సేవింగ్స్ అకౌంట్స్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మొదలుపెట్టేలా కృషి చేయాలి. సిప్‌లో నెలకు రూ.500 చొప్పున వారు ఇన్వెస్ట్ చేసేలా సహకరించండి. అలా పెడుతూపోయిన నగదు ఏ రకంగా పెరుగుతుందో కూడా వారికి చూపిస్తూ వివరించండి. ఇలా వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు నడిపిస్తే ప్రతీ రూపాయిని వారు మిగుల్చుకుని, దాన్ని సేవింగ్స్‌లోకి, అలా పెట్టుబడి సాధనాల్లోకి తీసుకెళ్లగలరు.

రిస్కులు-బీమా

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అందుకే వాటి గురించి కూడా పిల్లలకు చెప్పాలి. ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటివి ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో వివరించాలి. అందుకే ముందు జాగ్రత్తగా ఎమర్జన్సీ ఫండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాలి. అలాగే బీమా అవశ్యకతను వివరించాలి. ఆర్థిక ప్రణాళికలో బీమా సైతం ప్రధానమేనని తెలియజెప్పడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా ఇలా దేనికదే ముఖ్యమైనది మరి. దేన్నీ న